సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 17 । మార్చి । 2023



చిరుధాన్యాల సాగు పెంపు

ఆరోగ్య సిరిగా పేరుగాంచిన చిరుధాన్యాల సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అధిక విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. - IIలో



మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో కొత్త మండలాలు

విజయనగరం జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులలో కొత్తగా మూడు మండలాలను విలీనం చేసినట్టు ఐసీడీఎస్ పీడీ వి.శాంతకుమారి తెలిపారు. - IIలో

'అరసేతిలో బువ్వపువ్వుకు ' ఉగాది సాహిత్య పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: కవితా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది సాహిత్య పురస్కారాల పోటీల్లో పార్వతీపురానికి చెందిన చింతా అప్పల నాయుడు రచించిన 'అరసేతిలో బువ్వపువ్వు' కవితా సంపుటికి ప్రథమ బహుమతి వచ్చింది. ఆయనకు ఈనెల 19న శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే సభలో నగదు బహుమతి అందజేయనున్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్యమే మహాభాగ్యం

- డీఐఓ జగన్మోహనరావు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులందరూ ఆరోగ్యజాగ్రత్తలు తీసుకుంటూ చక్కగా చదువుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులకు రక్తహీనత, సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు, రోగనిరోధక శక్తి పెంపొందించుకునే మార్గాలపై అవగాహన కల్పించారు. వేసవికాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటనాయుడు, సూపర్‌వైజర్ జాయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పాలకొండ: గ్రంథాలయాలకు వెళ్లి యువతకు విజ్ఞానాన్ని ఆర్జించాలని సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ పిలుపునిచ్చారు. పాలకొండ పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు. ప్రతిరోజూ గ్రంథాలయం తెరిచి ఉంచాలన్నారు.

ఆప్కోలో చేనేతవస్త్రాల క్లియరెన్స్ సేల్

- డివిజనల్ మార్కెటింగ్ అధికారి జగదీశ్వరరావు

విజయనగరం అర్బన్: ఉగాది వేడుకను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆప్కోలో ఎంపికచేసిన వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు ధరలతో క్లియరెన్స్ సేల్‌ను ప్రారంభించినట్టు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి టి.జగదేశ్వరరావు గురువారం తెలిపారు. ఒకటి కొంటే మరొకటి ఉచితం, ఒకటి కొంటే రెండు ఉచితం, ప్రత్యేక తగ్గింపు ధరలను అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. క్లియరెన్స్ సేల్ కౌంటర్‌ను పూల్‌బాగ్ కాలనీలోని శివాలయం ఎదురుగా ఉన్న ఆప్కోభవన్ వద్ద ప్రారంభిస్తామని తెలిపారు. చేనేత కళాకారులు మగ్గంపై నేసిన ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, చీరాల, గద్వాల్, పట్టు, కాటన్, చీరాల, బందరు, రాజమండ్రి, పాయకరావుపేట, బొబ్బిలికాటన్, ఫాన్సీ చీరలు, మంగళగిరి, చీరాల డ్రెస్‌మెటీరియల్స్, రెడీమేడ్ షర్ట్స్, టవల్స్, లుంగీలు, ధోవతులు, కాటన్ షర్టింగ్, చేతిరుమాలు తదితర చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచినట్టు వివరించారు.

కలెక్టర్‌కు చలివేంద్రి రైతుల సత్కారం



కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న చలివేంద్రి గ్రామ రైతులు

వీరఘట్టం: నెలరోజుల కిందట వీరఘట్టం మండలంలోని చలివేంద్రి గ్రామానికి వెళ్లిన కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కొందరు రైతులు అడ్డగించిన సంగతి తెలిసిందే. కొన్ని ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉసిగొల్పడంతో ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించారు. ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలుచేయించి, రైతుల ఖాతాలకు బిల్లులు జమచేయించారు. రైతుల ఆహ్వానం మేరకు ఆయన గురువారం సాయంత్రం గ్రామానికి వచ్చారు. ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నించారు. నెలరోజుల కిందట గ్రామంలో ఏర్పడిన అనుకోని సంఘటనల వల్ల మీ గ్రామానికి ఇంకా దగ్గరయ్యానని కలెక్టర్ పేర్కొన్నారు. రబీ సీజన్‌లో సాగుచేసే పంటల వివరాలపై ఆరా తీశారు. గ్రామంపై కలెక్టర్ చూపుతున్న శ్రద్ధకు రైతులందరూ ముగ్దులై దుశ్శాలువతో సత్కరించారు. గ్రామస్తుల వినతి మేరకు తోటపల్లి ఎడమకాలువపై బ్రిడ్జి నిర్మాణంతో పాటు బీటీ రోడ్డు కల్వర్టు పనులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ ఉన్నారు.

సంక్షేమ పద్దు



- సంక్షేమం, సుపరిపాలనే ప్రథమ ప్రాధాన్యాలుగా రాష్ట్ర బడ్జెట్
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట
- తోటపల్లి బ్యారేజీ పనులకు రూ.80.84 కోట్లు
- తారకరామతీర్థ సాగర్‌కు రూ.50 కోట్లు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.141.79 కోట్ల కేటాయింపు
- బడ్జెట్ కేటాయింపులపై సర్వత్రా హర్షం




సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరం ఉమ్మడి జిల్లాకు కీలక కేటాయింపులు జరిగాయి. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించింది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు గత మూడేళ్ల మాదిరిగానే ఈసారి కూడా నిధుల కేటాయింపులో ప్రాధాన్యమిచ్చింది. మన్యంలో రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేసింది. అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌పై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తంచేస్తున్నారు. సంక్షేమం, సుపరిపాలనే ప్రథమ ప్రాధాన్యాలుగా, మ్యానిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించాలనే సీఎం సంకల్పానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొంటున్నారు.

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి విజయనగరం జిల్లాలో జలయజ్ఞంలో భాగంగా తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయిస్తున్నారు. వాస్తవానికి వైఎస్సార్ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు వాటి పనులను కొనసాగించడంలో నిర్లక్ష్యం వహించారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా గాలికి వదిలేసింది. తను అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులన్నీ ప్రథమ ప్రాధాన్యంగా పూర్తి చేయిస్తానని రైతులకు జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్పయాత్రలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే గత మూడు దఫాల బడ్జెట్‌ల్లో నిధులు కేటాయించారు. గత ఏడాది 2022-23 బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులకు రూ.297.50 కోట్లు, తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులకు రూ.126.61 కోట్లు, తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఆనకట్ట తదితర అభివృద్ధి పనులకు, కాలువలకు నిర్మాణానికి రూ.124.50 కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. తద్వారా ఆయా ప్రాజెక్టుల పనుల్లో కదలిక వచ్చింది. వాటికి కొనసాగింపుగా ఈసారి 2023-24 బడ్జెట్లో కూడా ప్రాధాన్యతను ముఖ్యమంత్రి కొనసాగించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.141.79 కోట్లు, తోటపల్లికి రూ.80.84 కోట్లు, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టుకు రూ.50 కోట్లు, జంఝావతి ప్రాజెక్టుకు రూ.3 కోట్లు కేటాయించారు.

తోటపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలోకి...



వై.ఎస్.రాజశేఖరరెడ్డి తలపెట్టిన తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని పనులు మిగిలిపోయాయి. వాటిని పూర్తి చేయడానికి వీలుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. 2021-22 బడ్జెట్‌లోనే రూ.189.70 కోట్లు, 2022-23 బడ్జెట్‌లో రూ.126.61 కోట్లు కేటాయించగా ఈసారి రూ.80.84 కోట్లు నిధులివ్వాలని ప్రతిపాదించారు. వాస్తవానికి తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ లక్ష్యం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 1,95,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది. మొత్తం కొత్త కుడిప్రధాన కాలువ, బ్రాంచ్ కాలువల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గత ఏడాది రూ.59.58 కోట్లతో పార్వతీపురం డివిజన్ పరిధిలోను, రూ.63.63 కోట్లతో రాజాం డివిజన్ పరిధిలో బ్యాలెన్స్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద హెడ్ రెగ్యులేటరీ వర్క్‌తో పాటు పిల్ల కాలువల తవ్వకం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే తోటపల్లి ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో పనులు జరిగినట్లే. తాజాగా కేటాయించిన రూ.80.84 కోట్ల నిధులు దీనికి ఎంతో ఉపయుక్తమవుతాయి.

లక్ష్యం దిశగా తారక రామతీర్థ సాగర్...

పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లోని రైతులకు సాగునీరు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలనేది తారక రామతీర్థసాగర్ ప్రాజెక్టు లక్ష్యం. 2006 సంవత్సరంలో జలయజ్ఞంలో భాగంగానే నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. తారక రామ అని పేరుపెట్టినా తర్వాత కాలంలో టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను కొనసాగించడంపై నిర్లక్ష్యం చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాతే నిధులు కేటాయింపు జరిగింది. 2021-22లో రూ.201 కోట్లు, 2022-23లో రూ.124.50 కోట్లు కేటాయించారు. పునరావాసానికి అవసరమైన రూ.90 కోట్ల నిధులను ప్రభుత్వం గత ఏడాది విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.50 కోట్లు ప్రాజెక్టు మిగులు పనులను పూర్తి చేయడానికి ఉపయోగపడతాయి. త్వరలో శంకుస్థాపన చేయనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన నీటిని ఈ ప్రాజెక్టు నుంచే సరఫరా చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో ప్రాధాన్యతను సంతరించుకుంది.



ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులకు ఊపు...



గోదావరి మిగులు జలాలను పోలవరం కాలువ ద్వారా తీసుకొచ్చి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తలపెట్టినదే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు. జిల్లాలో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది దీని లక్ష్యం. 2021-22లో రూ.79.95 కోట్లను, 2022-23లో రూ.297.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో రూ.141.79 కోట్లను ప్రతిపాదించింది. భూసేకరణ ప్రక్రియ శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో తాజా నిధులతో కాలువ తవ్వకం పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

పేదల బడ్జెట్



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేలా బడ్జెట్ కేటాయింపులు చేసింది. విద్య, వైద్యం, మహిళా సాధికారత కోసం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిచ్చింది. ఇది చరిత్రలో నిలిచిపోయే బడ్జెట్

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే, కురుపాం

అన్నివర్గాలకు మేలు



జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రోత్సాహంగా ఉంది. బలహీన వర్గాలను ప్రోత్సహించేలా సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించడం హర్షణీయం. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అనేక కేటగిరీల్లో వృద్ధి సాధించేలా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.

– అలజంగి జోగారావు, ఎమ్మెల్యే పార్వతీపురం

ఆమోదయోగ్యం



అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ ఇది. పిల్లల చదువులకు పెద్దపీట వేశారు. సమాజంలో అసమానతలు తగ్గించేలా బడ్జెట్ కేటాయింపులు చేయడం శుభ పరిణామం. విద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమివ్వడం అభినందనీయం.

– అంబటి కృష్ణంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్, అంటిపేట

మహిళా సాధికారతే ధ్యేయం



మహిళా సాధికారతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో వేలకోట్ల రూపాయలు కేటాయించింది. పేద మహిళలు ఆర్థికంగా బలపడేందుకు, స్వయంసమృద్ధి సాధించేందుకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది. రైతుభరోసా కేంద్రాలతో సమానంగా మహిళా పాల సహకార సంఘాలను ప్రోత్సహించడానికి జగనన్న పాల వెల్లువ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, పాలకొండ

మహిళలకు ప్రయోజనం



స్త్రీ శిశుసంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.3,951 కోట్లు కేటాయించడం బాగుంది. ఇది మహిళా సాధికారతకు తోడ్పడుతుంది. అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యమిచ్చారు.

– మరిశర్ల బాపూజీనాయుడు, జెడ్పీ వైస్‌చైర్మన్, రావివలస

రైతులను ఆదుకునేలా..



వ్యవసాయం మరింత లాభదాయకంగా సాగేలా బడ్జెట్‌లో యాంత్రీకరణ కోసం రూ.1,212 కోట్లు కేటాయించారు. ఇది రైతులకు మేలు చేస్తుంది. రైతు స్థిరీకరణ నిధితో పంటలకు మద్దతు ధర లభిస్తుంది.

– ఉరిటి రామారావు, ఎంపీపీ, గరగుబిల్లి మండలం

భవిష్యత్‌కు బాటలు



రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని జగనన్న ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించింది. విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తూనే గ్రామ స్థాయిలో అభివృద్ధి, పారిశ్రామిక పురోభివృద్ధి, వెనుకబడిన వర్గాల సంక్షేమం, నవరత్నాలను మెరుగ్గా అమలు చేసేందుకు బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలవారి పురోగతికి తాజా బడ్జెట్‌లో చోటుకల్పించడం అభినందనీయం.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

ఎస్సీ, ఎస్టీలకు అధిక లబ్ధి



బడ్జెట్ కేటాయింపుల్లో షెడ్యూల్డ్ కులాలు సంక్షేమానికి రూ.20,005 కోట్లు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి రూ.6,929 కోట్లు, బీసీ కులాల సంక్షేమానికి రూ.38,605 కోట్లు నిధులు కేటాయించి బలహీన వర్గాలపట్ల జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధిని మరోమారు కనబర్చింది. వ్యవసాయానికి రూ.12,369 కోట్లు, ఈబీసీ వర్గాలకు రూ.610 కోట్ల కేటాయింపు హర్షణీయం.

– ఎ.చిన్నారావు, తాడికొండ గ్రామం, జిల్లా ఎస్టీసెల్ కన్వీనర్

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం అహర్నిశలు కృషి చేసి ఆంధ్రరాష్ట్ర ఆవిర్భానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన రాష్ట్రం ఏర్పాటుకోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవియైన మహాపురుషుడని పేర్కొన్నారు. ఆయన త్యాగం అజరామరం అన్నారు. శ్రీరాముల ప్రాణత్యాగం వల్లే దేశవ్యాప్తంగా భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడ్డాయని, అన్ని ప్రాంతాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. శ్రీరాములు గొప్ప దేశభక్తుడని, మహాత్మాగాంధీ ప్రభావానికి లోనై ఉద్యోగాన్ని వదిలి అనుంగ శిష్యుడిగా చేరారన్నారు. అమరజీవి అడుగుజాడలలో యువత నడవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, పీఆర్ ఎస్ఈ ఎం.వి.ఆర్.కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, డీపీఓ బి.సత్యనారాయణ, సీపీఓ పి.వీరరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతే ప్రధానం

పార్వతీపురం: వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణశాఖ సూచనలు మేరకు వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన చోట వైద్య శిబిరాల నిర్వహణతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

- 1122 మంది గైర్హాజరు
- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులు డిబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. విజయనగరం ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన సెకెండియర్ సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షకు 1122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 19,250 మంది సాధారణ విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18,445 మంది హాజరయ్యారు. 805 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 4,414 మందికి 4,097 మంది హాజరయ్యారు. 317 మంది హాజరుకాలేదు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్టు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

మన్యంలో భారీ వర్షం

భామిని/సీతంపేట/పాలకొండరూరల్/కురుపాం/కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురగాలులకు పలు చోట్ల చెట్లు నేలకూలాయి. కురుపాం మండలంలోని బియ్యాలవలస పంచాయతీ సచివాలయం సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఈదురుగాలులకు పూత, పిందె దశలో ఉన్న జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతుందని కొందరు రైతులు ఆందోళన చెందుతుండగా, నువ్వు, జొన్న పంటలకు ఉపకరిస్తుందని మరికొందరు రైతులు చెబుతున్నారు.



కుమ్మరిగుంట రోడ్డుపై కూలిన చింతచెట్టు



కొమరాడ: ఆర్తాంలో కురుస్తున్న భారీవర్షం

ఇంటింటా ఫీవర్ సర్వే

- హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాతో జాగ్రత్త
- ఈనెల 11 నుంచి సాగుతున్న ఫీవర్ సర్వే
- విధుల్లో 5,419 మంది వలంటీర్లు, 1571 మంది ఆశవర్కర్లు
- 37 పీహెచ్‌సీలు, 5 యూహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణ



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురం టౌన్:

దేశవ్యాప్తంగా హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాప్తిపై ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది. జిల్లాలో ఎలాంటి కేసులు నమోదు కాకపోయినా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా వైద్యాధికారులు ఈ నెల 11 నుంచి ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు. 15 పీహెచ్‌సీలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్ల పర్యవేక్షణలో సర్వే సాగుతోంది. 5,419 మంది వలంటీర్లు, 1571 మంది ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు సర్వే విధుల్లో నిమగ్నమయ్యారు. పీహెచ్‌సీ, యూహెచ్‌సీ వైద్యాధికారులు సర్వే తీరును పర్యవేక్షిస్తున్నారు.

వైరస్ లక్షణాలపై ఆరా..

ఇన్ ఫ్లూయెంజా వైరస్ లక్షణాలతో ఏ ఇంట్లోని వ్యక్తులైనా బాధపడుతున్నారా? అన్న కోణంలో సర్వే చేస్తున్నారు. జలుబు, జ్వరం, దద్దుర్లు, దగ్గు, శ్వాసకోశ సమస్యలపై ఆరా తీస్తున్నారు. సర్వే మొదలైన ఐదు రోజుల్లో జిల్లాలో అలాంటి తీవ్ర లక్షణాలు ఉన్న ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఒకవేళ వైరస్ లక్షణాలు ఉంటే వారి నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తారు. వైరస్ వల్ల ప్రాణాపాయం లేకపోయినా, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సర్వే సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో సర్వే తీరు ఇలా...	
మండలాలు	15
మున్సిపాలిటీలు	2
నగర పంచాయతీ	1
వైద్యులు	83 మంది
పీహెచ్‌సీలు	37
యూహెచ్‌సీలు	5
ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది	281
ఆశవర్కర్లు	1571
వార్డు, గ్రామ వలంటీర్లు	5,419



గ్రామాల్లో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గొంతు నొప్పి, జ్వరం (3 నుంచి 5 రోజులు), దగ్గు 3 వారాలు, ఆయాసం, చలి, వాంతులు, ముక్కు కారడం, తుమ్ములు వంటి లక్షణాలు కనిపిస్తే ముందుగా చేతులను తరచూ పరిశుభ్రం చేసుకోవాలి. ఫేస్ మాస్క్ పెట్టుకోవాలి. జనానికి దూరంగా ఉండాలి. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేయి అడ్డు పెట్టుకోవాలి. ఎక్కువగా నీరు తాగాలి. జ్వరం, ఒళ్లు నొప్పులు ఉంటే పారాసిటమాల్ ట్యాబ్లెట్లు వేసుకోవాలి. కరచాలనం చేయకూడదు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయకూడదు. యాంటీబయాటిక్స్, మందులు వాడే ముందు విధిగా వైద్యులను సంప్రదించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు వైరస్ లక్షణాలు ఎవరిలోనూ కనిపించలేదన్నారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రామారావు మృతదేహం

సీతంపేట: సీతంపేటలోని తురాయిపువలస వీధికి చెందిన గిరిజనుడు సవర రామారావు(37) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఎస్సై నీలకంఠరావు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. భార్యాభర్తల మధ్య చిన్న తగాదా రావడంతో ఆమెపై కోపంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగేసి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు ప్రథమ చికిత్స అందచేస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

మళ్లీ వచ్చిన ఏనుగుల గుంపు


దుగ్గిలో సంచారిస్తున్న ఒంటరి ఏనుగు

కొమరాడ: ఇటీవల నాగావళి నది అవల వైపు జియ్యమ్మవలస మండలం బాసంగి, వెంకటరాజపురం తదితర గ్రామాల్లో సంచరించిన ఆరు ఏనుగుల గుంపు మళ్లీ కొమరాడ మండలంలోని కళ్లికోటకు చేరుకుంది. బుధవారం రాత్రి కళ్లికోట గ్రామనికి చెందిన ఓ రైతు ఇంటి వద్ద ఏనుగులు సంచరించాయి. అలాగే ఒంటరి ఏనుగు పాత దుగ్గి గ్రామంలో సంచరిస్తోంది. దీంతో రైతులంతా లబోదిబో మంటున్నారు పండిన పంటలతో పాటు నిల్వ చేసుకున్న విత్తనాలు కూడా నాశనం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపుపై అధికారులు చర్యలు తీసుకుని తరలించడానికి ప్రయత్నించాలని కోరుతున్నారు. అయితే ఒంటరి ఏనుగు పట్ల రైతులు, ప్రజలు అప్రమంతా ఉండాలని, రాత్రి పూట ఎవరూ ఒంటరిగా వెళ్లవద్దని, అలాగే వేకువ జామున కూడా పొలాల్లోకి ఒంటరిగా వెళ్లరాదని అటవీశాఖ సిబ్బంది సూచిస్తున్నారు ఒంటరి ఏనుగును గమనించి పొలాల్లోకి వెళ్లాలని కోరుతున్నారు.

ఘనంగా నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న నూకాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన విజయనగరం నూకాలమ్మ అమ్మవారి ఆలయ 65 వ వార్షిక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కర్రల మార్కెట్, మంగలవీధిలో కొలువైన అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 21న అమ్మవారి చల్లదన మహోత్సవం, ఘటాలతో ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులందరూ ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించాలని కమిటీ సభ్యులు కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150–00
బంగారం(22కి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

నలుగురు దొంగల అరెస్ట్

- దొంగిలించిన సామగ్రి రికవరీ
- రిమాండ్‌కు నిందితుల తరలింపు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడి వస్తువులను దోచుకుపోయిన కేసులో గరివిడి ఎస్సై బి.మురళి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దొంగలను పట్టుకుని దొంగతనం చేసిన వస్తువులను రికవరీ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ దొంగతనం కేసుకు సంబంధించిన ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి పట్టణంలోని కొండపాలెం హడ్కోకాలనీకి చెందిన తమ్మిన విజయలక్ష్మి విశాఖపట్నంలోని ఆరిలోవలో నివాసం ఉంటున్నారు. గరివడిలోని ఆమె ఇంట్లో ఈ నెల 8న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేశారు. ఈ విషయమై తనకు తెలిసిన వ్యక్తులు స్థానికులైన పద్మ, మణికుమార్‌లతో కలిసి గరివిడి పోలీస్‌స్టేషన్ వచ్చిన ఆమె ఈనెల 10న దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ఫింగర్‌ప్రింట్స్ సేకరించగా షేక్ కరీం అనే వ్యక్తి నిందితుడిగా తెలిసింది. ఈ నెల 15న కొండపాలెం జంక్షన్ వద్ద షేక్‌కరీంతో పాటు అతని స్నేహితులైన మరో ఇద్దరిని అరెస్టు చేసి విచారణ చేయగా విజయలక్ష్మి ఇంటిలో జమ్ము ధనుంజయ, బత్తుల రాజు సహకారంతో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దొంగిలించిన సామగ్రిని స్క్రాప్ దుకాణం నడుపుతున్న సందక రత్నకుమారికి విక్రయించినట్లు తెలిపారు. ఈమేరకు టీవీ, గ్రైండర్, మిక్సీ, డైనింగ్ టేబుల్‌ను వారి నుంచి రికవరీ చేసి ఆ నలుగురు నిందితులను రిమాండ్కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.


చిపురుపల్లి రూరల్: పోలీసులకు పట్టుబడిన నిందితులు, రికవరీ చేసిన సామగ్రి

నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఓఎల్‌ఎక్స్‌లో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించానని ఫేక్ మెసేజ్ చూపించి పరారైన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గుంకలాం గ్రామానికి చెందిన లెంక కృష్ణ తన వద్దనున్న రూ.లక్షా 15వేల విలువైన ఫోన్‌ను ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. అది చూసి విశాఖ నుంచి వచ్చిన వ్యక్తి కొనుగోలు చేసేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు బుధవారం రమ్మన్నాడు. అక్కడ వస్తువు చూసి తీసుకుని ఫోన్‌పే ద్వారా డబ్బులు వేసినట్లు నటించి, ఫేక్ మెసెజ్ చూపించి పరారయ్యాడు. ఈ ఘటనలో మోసపోయినట్లు గుర్తించిన కృష్ణ వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన వన్‌టౌన్ పోలీసులు 24 గంటల్లోపే కేసును ఛేదించారు. ఈ కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన వన్‌టౌన్ ఎస్సై వి.అశోక్ కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.


విజయనగరం టౌన్: వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

అన్నదాన సత్రానికి వాహనం వితరణ

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్‌లో ఉన్న సత్యసాయిబాబా నిత్యాన్నదాన సత్రానికి శ్రీకాకుళం గురుజాడ విద్యా సంస్థల అధినేత గుంట్రెడ్డి స్వామినాయుడు గురువారం వాహనాన్ని (మారుతి ఇకో) వితరణగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సత్రం నుంచి ప్రతిరోజూ 200 మంది నిరుపేదలకు వాహనం ద్వారా వారి ఇళ్లకు వెళ్లి భోజనం క్యారేజీలను అందజేస్తున్నారు. గతంలో ఉన్న వాహనం మరమ్మతుల బారిన పడిన విషయాన్ని సత్యసాయి భక్తులు స్వామినాయుడికి తెలియజేయడంతో వెంటనే ఆయన స్పందించి రూ.8 లక్షల విలువ గల మారుతి ఇకో వాహనం కొనుగోలు చేసి అన్నదాన సత్రానికి అందజేశారు. ఇప్పటికే గతంలో ఇక్కడ నిర్మించిన అన్నదాన సత్రానికి రూ. 2 కోట్ల విలువైన 40 సెంట్ల భూమిని ఉదారంగా ఇచ్చిన స్వామినాయుడు మరోసారి తన దాతృత్వం చాటుకున్నారని సత్యసాయి భక్తులు సంతోషం వెలిబుచ్చారు.



అన్నదాన సత్రానికి స్వామినాయుడు అందజేసిన మారుతి ఇకో వాహనం

వడ్డీ మాఫీ..

విజయనగరం: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై విధించిన వడ్డీని ప్రభుత్వం మాఫీ చేసిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాముల నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీలోగా ఒకేసారి మొత్తం పన్ను చెల్లించిన వారికే ఈ అవకాశం వర్తిస్తుందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు వెంటనే పన్ను చెల్లించి, వడ్డీ మాఫీ పొందాలని కోరారు.

నిధుల కేటాయింపుపై హర్షం

నెల్లిమర్ల రూరల్: ఏపీ అసెంబ్లీలో ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడంపై టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. సీతారామునిపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.8384 కోట్లు కేటాయించి దళితవర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు


చికిత్సపొందుతున్న సంతోష్‌కుమార్

పార్వతీపురం: కొమరాడ మండలం మాదలింగి గ్రామానికి చెందిన ఆర్. సంతోష్‌కుమార్, స్నేహితుడు డి.మోహన్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం సంతోష్, మోహన్‌లు మాదలింగినుంచి చినమేరంగికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. పాతతొడుము గ్రామం దాటిన తరువాత వెనుకనుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మోహన్, సంతోష్‌లకు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

కొమ్మ మీద పడి మరొకరికి..

జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన టి.యుగంధరరావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చెట్టుకొమ్మతలపై పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం కన్నపుదొరవలస నుంచి కార్పెంటర్ పని నిమిత్తం యుగంధర రావు, అసిస్టెంట్ కార్తీక్ ద్విచక్రవాహనంపై గుమ్మలక్ష్మీపురం వెళ్తుండగా పి.ఆమిటి జంక్షన్ సమీపంలో ఎండిపోయిన తుమ్మచెట్టు కొమ్మ యుగంధరరావు తలపై పడింది. దీంతో బలమైన గాయమైంది. కార్తీక్ వెంటనే 108కు ఫోన్‌చేసి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించాడు.


చికిత్స పొందుతున్న యుగంధరరావు

బస్సు ఢీకొని వ్యక్తికి..

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద గురువారం బస్సు ఢీకొని తెర్లాం మండలం పెదపాలవలస గ్రామానికి చెందిన చెల్లూరి విశ్వనాథం గాయాల పాలయ్యాడని ఎస్సై పి.సూర్యకుమారి తెలిపారు. జి.సిగడాంలో నివాసం ఉంటున్న కుమారుడు గౌరీశంకర్ ఇంటికి వెళ్లేందుకు విశ్వనాథం రాజాం వచ్చాడు. బస్టాండ్‌లో తన కోసం ఎదురుచూస్తున్న కుమారుడితో కలిసి నడుచుకుంటూ ఇన్‌గేటు వైపు వచ్చాడు. అదే సమయంలో కాంప్లెక్స్‌లోకి వస్తున్న బస్సు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. వెంటనే గమనించిన కుమారుడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

14టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత


విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో లారీ

బొండపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం జాతీయ రహదారి 26 మీదుగా లారీలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణం నుంచి కాకినాడలోని పోర్టుకు లారీలో అక్రమంగా 280 బస్తాల (14 టన్నులు) పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ బి.సింహాచలానికి అందిన సమాచారం మేరకు లారీని పట్టుకుని బొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని గజపతినగరంలోని ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించి అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి జి.పురుషోత్తం, ఏఎస్ఓ బి.అశోక్, గజపతినగరం సివిల్ సప్లయిస్ డీటీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో కొత్త మండలాలు

- ఐసీడీఎస్ పీడీ వి.శాంతకుమారి

తెర్లాం: జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులలో కొత్తగా మూడు మండలాలను విలీనం చేసినట్లు ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శాంతకుమారి తెలిపారు. మండలంలోని పణుకువలస, తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో రామభద్రపురం మండలాన్ని, రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో వంగర మండలాన్ని, బొబ్బిలి అర్బన్‌ను బొబ్బిలి రూరల్ ప్రాజెక్ట్‌లో విలీనం చేశామని తెలిపారు. గతంలో రామభద్రపురం మండలం సాలూరు ప్రాజెక్ట్‌లోను, బొబ్బిలి అర్బన్ అదే ప్రాజెక్ట్‌లోను, వంగర వీరఘట్టం ప్రాజెక్ట్‌లో ఉండేవని చెప్పారు. కొత్తగా ఒక్కో ప్రాజెక్ట్‌లో మూడు మండలాలను చేర్చేందుకు చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగానే మూడు ప్రాజెక్ట్‌లలో కొత్తగా ఒక్కో మండలాన్ని చేర్చినట్లు తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. తెర్లాం మండలం పణుకువలస అంగన్‌వాడీ కేంద్రంపై ఫిర్యాదు రావడంపై దర్యాప్తు నిర్వహించామని తెలిపారు. ఈ కేంద్రాన్ని తనిఖీ చేయగా ప్రీస్కూల్ నిర్వహణ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగానే జరుగుతుందని, స్టాక్ నిల్వల్లో కొద్దిగా తేడాలు ఉండడంతో వాటిని మిగులు నిల్వలో చూపించామన్నారు. ఆమెతోపాటు బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు ఉన్నారు.


తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ కిట్లను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

జాతీయ బాలభవన్ పోటీల్లో రాజాం విద్యార్థులు

రాజాం: బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలోని కలికరి స్టేట్ బాలభవన్‌లో ఈనెల 11 నుంచి 15 వరకూ 28వ నేషనల్ యంగ్ ఎన్విరాన్‌మెంట్‌లిస్ట్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాజాం వరలక్ష్మీ సెయింట్‌ఆన్స్ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు జె.ప్రసిద్ధు, టి.మోహనరావులు పాల్గొని, ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతితో పాటు మోహనరావు పెయింటింగ్, నాటిక ప్రదర్శనల్లో కూడా వరుసగా ద్వితీయ, కన్సొలేషన్ బహుమతులు సాధించాడు. ఆ విద్యార్థులకు నేషనల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ దీపక్‌సింగ్ చేతుల మీదుగా స్టేట్ బాలభవన్ డైరెక్టర్‌లు బహుమతులు అందజేశారు. మొత్తం 16 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రసిద్ధు, మోహనరావులను రాజాంలో వరలక్ష్మి సెయింట్‌ఆన్స్ స్కూల్‌లో గురువారం ప్రిన్సిపాల్ సిస్టర్స్ లూథ్‌మేరీ, కరస్పాండెంట్, సిస్టర్ సెసిలీన్, బాలభవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ తదితరులు గురువారం పాఠశాలలో అభినందించారు.


రాజాం: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి


సామిరెడ్డి సత్యారావు(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని కన్నాం గ్రామంలో చింత చెట్టు పైనుంచి జారిపడి గ్రామానికివ చెందిన సామిరెడ్డి సత్యారావు(54)మృతి చెందినట్లు పెద మానాపురం ఎస్సై బి.భాగ్యం గురువారం తెలిపారు. తన కళ్లంలో ఉన్న చింత చెట్టు ఎక్కి బొట్టలను తీస్తున్న క్రమంలో కాలు జారి కిందపడడంతో గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు వెంటనే 108లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.మృతుడికి పెళ్లైన కుమారుడు,కుమార్తె ఉన్నారు

చికిత్స పొందుతూ యువకుడు..

బొండపల్లి:ఈనెల 8న ద్విచక్రవాహనంపై వస్తూ తీవ్రంగా గాయపడిన గొల్లు పాలెం గ్రామానికి చెందిన యువకుడు పెంట సతీష్ విశాఖ పట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బొండపల్లి ఎస్సై రవి శవపంచనామా నిర్వహించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యాల సాగు పెంపు

- ఈ ఖరీఫ్‌లో 20 వేల ఎకరాల్లో చేపట్టేందుకు యోచన
- మూడు రెవెన్యూ డివిజనల్లో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్య సిరిగా పేరుగాంచిన చిరుధాన్యాల సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అధిక విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు ఇవ్వడంతో పాటు సాగుపై శిక్షణ కూడా ఇవ్వనున్నారు. చిరుధాన్యాలకు ఇటీవల డిమాండ్ పెరిగింది. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా చిరుధాన్యాలను తినడానికి ఇష్టపడుతున్నారు. రైతులు సాగుచేసిన చిరుధాన్యాలను కొనుగోలు చేసే విధంగా కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలో మూడు ప్రాసెసింగ్ యూనిట్లు

చిరుధాన్యాలు సాగు చేసినప్పటికీ కొనుగోలు తక్కువగా ఉండడంతో రైతులు సాగు చేయడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. అదేవిధంగా చిరుధాన్య ఉత్పత్తులను ఉప ఉత్పత్తులుగా తయారు చేయడానికి అవసరమైన ప్రాసెసింగ్ యూనిట్లు కూడా లేక పోవడం వల్ల కూడా చిరుధాన్యాల సాగు తక్కువగా అయ్యేది. దీన్ని గమనించిన ప్రభుత్వం జిల్లాలో విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి రెవిన్యూ డివిజన్‌లలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు నెలకొల్పడం ద్వారా చిరుధాన్యాల సాగు పెంచవచ్చని భావిస్తోంది.


గత సీజన్‌లో 3,090 ఎకరాల్లో సాగు

2022 ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాలు 3,090 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 20 వేల ఎకరాల్లో చిరుధాన్యాల్లో ప్రధానమైన చోడి పంటను సాగు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. బోరు బావుల వద్ద, తేలిక పాటి నేలలు, వర్షాధార భూముల్లో వరికి ప్రత్యామ్నాయంగా చోడి పంటను సాగు చేసేలా చర్యలు చేపడుతున్నారు.

చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై నాణ్యమైన విత్తనాలు అందించనుంది. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానంలో చోడి పంటపై పరిశోధనలు చేసి అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను అందించనున్నారు.


గంట్యాడ మండలంలో సాగులో ఉన్న చోడి పంట

రాయితీపై విత్తనాలు



చిరుధాన్యాల సాగును పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. 2023 ఖరీఫ్, సీజన్‌లో 20 వేల ఎకరాల్లో చోడి సాగు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు, అవసరమైన సూచనలు, సలహాలు అందించనున్నాం.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి